క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణం లోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

బోర్లకు మరమ్మతులు



బోరుకు మరమ్మతు చేయిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో మంగళవారం బోర్లకు మరమ్మతులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ మహబూబ్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బందెలమాబు మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి బోర్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించామన్నారు. ప్రస్తుతం ఈ బోర్లతో వివిధ కాలనీ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు.

గోమాతకు అంత్యక్రియలు



ట్రాక్టర్‌లో గోమాతను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడు బంగ్లాలో మంగళవారం మృతిచెందిన గోమాత (ఆవు)కు గ్రామస్తులు మేళతాళాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని నాగిరెడ్డి స్వామి ఆలయ గోమాత అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకొన్న గ్రామస్తులు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో గోమాతను గ్రామపురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామంలోని శ్మశానవాటికలో భక్తిశ్రద్ధలతో అంత్యక్రియలు నిర్వహించారు.

బంజారాల సంస్కృతిని కాపాడాలి

ఆత్మకూరు : బంజార జాతి ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామ్‌బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు. కొట్టాలచెర్వు గ్రామంలో మంగళవారం బంజార జాతి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బంజారాలు అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం గ్రామంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రాజేశ్వర్‌నాయక్, సలహాదారునిగా బాలునాయక్, ఉపాధ్యక్షుడిగా శంకర్‌నాయక్, ట్రెజరర్‌గా తులసీనాయక్ , కార్యదర్శులుగా బాలునాయక్, రాజు నాయక్‌లతో పాటు పలువురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



కొలనుభారతిదేవిని దర్శించుకుంటున్న జెడ్పీటీసీ

కొత్తపల్లి: కొలనుభారతి దేవి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం దేవినవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించుకొని, అక్కడే ఉన్న సప్తశివాలయాలను దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణ పనులు ఆగిపోవడంతో ఆలయాభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పనులు పునఃప్రారంభం అయ్యేవిధంగా కృషి చేస్తామన్నారు.

నూతన రహదారికి భూమిపూజ



నూతన రహదారికి భూమిపూజ చేస్తున్న కో ఆప్షన్ సభ్యుడు ఎమ్‌ఏ రషీద్

ఆత్మకూరు: పట్టణంలోని 16వ వార్డులో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ కో ఆప్షన్‌సభ్యుడు రషీద్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కో ఆప్షన్‌సభ్యుడితో పాటు 16వ వార్డు కౌన్సిలర్ విజయచౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. గడప గడపలో 16వ వార్డు కాలనీ ప్రజలు సీసీ రోడ్డు అడిగారని, ఆ వార్డుల్లో నూతన రహదారులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో సీసీ రోడ్లను ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్, రమణ, అయ్యప్ప,వెంకటస్వామి గౌడు, ముర్తుజా, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం

- గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- బండిఆత్మకూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



ఈసీజీ పరీక్షల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ.. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తున్నారని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చరిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. మారుమూల గ్రామాలకు ప్రత్యేక వైద్యనిపుణులు వచ్చి వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి కార్యక్రమం రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. అత్యాధునిక ఈసీజీ, థైరాయిడ్, పరీక్షలు ఉచితంగా చేస్తూ పేదలకు ఆర్థిక భారం తగ్గిస్తున్నారన్నారు. శిబిరంలో వైద్యులు 627 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, వైస్ ఎంపీపీలు ముంతల మధురాణి, రాగాల వెంకటరమణ, సర్పంచ్ సంధ్య, ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, సలహామండలి చైర్మన్ కృష్ణమల్లారెడ్డి, బాబురెడ్డి, ఎంపీటీసీ ఎరుకలి పుల్లయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

బొల్లవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

మహానంది మండలం బొల్లవరం గ్రామంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. వైద్యులు 545 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ బండి రమణయ్య, మండల ఉపాధ్యక్షురాలు బండి సరస్వతి, సర్పంచ్ జమాల్‌బీ, మాజీ ధర్మకర్త బండి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

జూపాడుబంగ్లా: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, సర్పంచులు వంగల లక్ష్మిదేవి, గొల్ల మాధవి అన్నారు. మంగళవారం మండలంలోని తాటిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 650మందికి వైద్యులు పలురకాల వైద్యపరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. పలువురికి కంటి అద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రులకు రెఫర్‌చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, వంగల కృష్ణారెడ్డి, తరుణ్‌కుమార్ రెడ్డి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

నందికొట్కూరు రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, బిజినవేముల సర్పంచ్ రవియాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీవో శోభారాణి, జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ పబ్బతి రవి పాల్గొన్నారు.



బిజినవేములలో రోగుల వివరాలను తెలుసుకుంటున్న ఎంపీపీ, సర్పంచ్



తాటిపాడులో వైద్యపరీక్షలు చేయించుకునేందుకు బారులు తీరిన గ్రామస్తులు



కంటిఅద్దాలను అందజేస్తున్న జెడ్పీటీసీ, అధికారులు, తదితరులు

మారుమూల గ్రామాల్లో మెరుగైన వైద్యం



వానాల గ్రామంలో రోగులకు మందులు అందజేస్తున్న గ్రామ సర్పంచు లలితమ్మ

నందికొట్కూరు: మారుమూల గ్రామాలకు జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం అందిస్తున్నారని వానాల గ్రామ సర్పంచు లలితమ్మ అన్నారు. మంగళవారం పాములపాడు మండలంలోని వానాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో 524 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ రాధ, ఈఓఆర్డీ శ్రీనివాసనాయుడు, డాక్టర్లు గులాబ్షా, స్పెషల్ డాక్టర్లు నవీన్, దివ్య, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలక్షేత్ర పరిశోధనపై సమావేశం



మాట్లాడుతున్న దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రపరిశోధనపై ఉపముఖ్యమంత్రి , దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు కన్వీనర్‌గా వ్యవహరించారు. భ్రమరాంబా అతిథిగృహంలో జరిగిన ఈ సమావేశంలో పరిశోధనా రంగంలో అనుభవం కలిగిన డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి, శ్రీశైల ప్రభ మాస పత్రిక విశ్రాంత సంపాదకులు డాక్టర్ వి.ఎం చక్రవర్తి , శ్రీశైలం ప్రాంగణం తెలుగువిశ్వవిద్యాలయం ఆచార్యులు రామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ, శ్రీశైలప్రభ సంపాదకులు డా.సి అనిల్‌కుమార్, దేవస్థానం సహాయ స్థపతి ఐ.యు.వి జవహర్‌లాల్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ దేవస్థానం పక్షాన మ్యూజియం, ఆధ్యాత్మిక గ్రంథాలయం, ఆర్ట్ గ్యాలరీ నిర్మాణానికి తగిన స్థల పరిశీలన చేసి, నిర్మాణానికి అవసరమైన ప్రణాళిక, అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. దేవస్థానం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు.

విద్యుత్ సరఫరాలో సమస్యలు పరిష్కరించండి



విద్యుత్ సమస్యలపై ఏడీఏను నిలదీస్తున్న సొసైటీ అధ్యక్షుడు నాగతులసి రెడ్డి

మిడుతూరు: రైతులకు అందిస్తున్న విద్యుత్ సరఫరాలో తలెత్తిన సమస్యలపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి ఏడీఏ శ్రీనివాసులును నిలదీశారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో రైతులకు తెలియడం లేదని.. ఈ విషయంలో ఫోన్‌లు చేసినా విద్యుత్ సబ్‌స్టేషన్ల నుంచి సరైనా సమాచారం లేదని ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ ఏడీఏపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో స్పందించినా ఏడీఏ వర్షాభావ పరిస్థితుల కారణంగా పగటి పూట 9 గంటలు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయలేక పోతున్నామని, రైతులకు గ్రూపులు ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరా వేళలను గ్రూప్‌లో సమాచారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే గని గ్రామానికి సమీపంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం వలన ఆ ప్రాంతంలో సంచరించే కృష్ణజింకలు దేవనూరు, చింతలపల్లి, ఖాజీపేట, పీరుసాహెబ పేట గ్రామాల్లో పంట పొలాలకు నష్టం కల్గిస్తున్నాయని, పంట నష్టానికి పరిహారం ఇప్పించాలని చింతలపల్లి ఎంపీటీసీ నాగేశ్వరరెడ్డి ఏఈఓ సంధ్యను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు, వైస్ ఎంపీపీ నబిరసూల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్ మౌలా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జూపాడుబంగ్లా: చట్టాలపై సచివాలయాల్లోని మహిళా సంరక్షణ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ మారుతిశంకర్ తెలిపారు. మంగళవారం జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో మండలంలోని సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు(జీఎంఎస్‌కే) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో నేరచరిత్ర కలిగిన వ్యక్తుల వివరాలు, వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలన్నారు. ఏదేని సంఘటన జరిగిన వెంటనే అందుకు సంబంధించిన సమగ్రసమాచారం తెలుసుకొని, పోలీసుస్టేషన్‌కు చేరవేయాలనని సూచించారు.

అధికలోడుతో వెళ్తే చర్యలు

అధికలోడుతో వాహనాలను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మారుతిశంకర్ హెచ్చరించారు. మంగళవారం జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్ పరిధిలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలులేని వారికి జరిమానాలు విధించినట్లు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: శ్రీశైలం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన యాజమానులు సమస్యలను పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రయదర్శిని అన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టులో ఆత్మకూరు ఆర్డీఓ, శ్రీశైలం డిప్యూటీ కలెక్టర్, నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీన జరిగే స్పెషల్ లోక్ అదాలత్‌లో శ్రీశైలం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

పాడిపశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

మహానంది: పాడిపశువుల పెంపకంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యుల సలహాలు తీసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా పశుసంవర్ధక శాఖ ఆఫీసర్ డాక్టర్ గోవింద నాయక్ తెలిపారు. బొల్లవరం, తమ్మడపల్లె గ్రామాల్లో రైతులకు మంగళవారం పాడిరైతులకు అవగాహన కార్యక్రమాలు, పశు వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాడిపశువుల పోషణకు ప్రభుత్వం సబ్సిడీతో పోషకాహార పదార్థాలతో కూడిన మిశ్రమ దాణా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కరుణాకర్, డాక్టర్ సుబ్బారెడ్డి, వీఎల్ఓ సులోచన, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

నందికొట్కూరు: జైకిసాన్ పార్కులో మున్సిపల్ మహిళా కార్మికులకు పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు రామిరెడ్డి, నరసింహారెడ్డి, మోహన్‌రావు, వెంకటరావు, రంగడు మంగళవారం దుస్తులను అందజేశారు. వారు మాట్లాడుతూ దసరా పండుగ ముందస్తుగా 30 మంది మహిళా కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు సురేష్, లక్ష్మీనారాయణ, జోహార్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి తులాభారం



తులాభారం ద్వారా వస్తువులను సమర్పిస్తున్న భక్తులు

మహానంది: మహానందీశ్వరస్వామికి భక్తులు తులాభారం ద్వారా వస్తువులను సమర్పించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన రామ్మోహన్ రావు, విజయలక్ష్మి కుటుంబ సభ్యులు 350 కిలోల బియ్యం, 105కిలోల బెల్లం, పది కిలోల పసుపు, పదికిలోల కుంకుమ, కలకండ, పెసరపప్పు, మొదలైన ద్రవ్యాలను సమర్పించారన్నారు. వేదపండితులు రవిశంకర అవధాని, పండితులు ఆశీర్వచనాలు చేశారు. కార్యక్రమంలో మాధవి, మీనాక్షి సుబ్బలక్ష్మీ, కామేశ్వరీ లహరి తదితరులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

భూపనపాటి నరసింహుడుకు నివాళి

కొత్తపల్లి: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాదిగల అభ్యున్నతికి కృషిచేసిన వ్యక్తి భూపనపాటి నరసింహుడు అని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నాగరాజు, ఈ రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు భూపణపాటి నరసింహులు 4వ వర్ధంతిని నిర్వహించారు. కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డితో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పురుషోత్తం, నరసింహ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో ఈనెల 15వ తేదీన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు బాధితుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మంగళవారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రఘురామయ్యగౌడ్ తెలిపారు. తన ఇంటి వద్ద ఉంచిన ఏపీ 39టీడబ్ల్యూ 1363 నెంబరు గల ద్విచక్రవాహనాన్ని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు పోలీసులకు తెలిపాడు.

పేదలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వద్దు



ప్రజలు ఇచ్చిన అర్జీని పంచాయతీ కార్యదర్శికి రెఫర్ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- నెహ్రూనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం

పగిడ్యాల: ప్రభుత్వం పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తోందని, క్షేత్రస్థాయిలోని అధికారులు నిర్లక్ష్యం వహించడం మంచిది కాదని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండలంలోని నెహ్రూనగర్ సచివాలయం 2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి జగనన్న సంక్షేమ బావుటా పుస్తకాలను పంపిణీ చేస్తూ నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ రవి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సగినేల రమణ, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఓంకారంలో అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి అమ్మవారు



కొలనుభారతి ఆలయంలో అన్నపూర్ణాదేవి అమ్మవారు



నందికొట్కూరులో భవానిదేవి అలంకారంలో వాసవీమాత

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



మహానందిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారికి పూజలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు, పండితుల బృందం ఉదయం నుంచి రాత్రి వరకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బండిఆత్మకూరు మండలంలోని ఓంకారంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. ఉమాదేవి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. బండిఆత్మకూరు మండలం కాకనూరు శ్రీ శారదాపీఠంలో పీఠాధిపతి శివయోగీంద్ర సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీవాసవికన్యకపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు మహాగౌరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరి దేవాలయంలో చౌడేశ్వరి మాతను మహాలక్ష్మీగా అలంకరించారు.

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని అర్ధనారీశ్వరీ రూపంలో అలంకరించారు. వేల్పనూరు గ్రామంలో అంకాల పరమేశ్వరి అమ్మవారిని చంద్రఘంటాదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల గ్రామంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారు మూడవరోజు శ్రీ చంద్రఘంటాదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మిడుతూరు: స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం, చౌడేశ్వరీ దేవీ ఆలయంలో అమ్మవార్లు మంగళవారం భవానీ దేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణదేవిగా కొలనుభారతిదేవి అమ్మవారు

కొత్తపల్లి: మూడవరోజు మంగళవారం శ్రీకొలనుభారతిదేవి అమ్మవారు భక్తులకు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పురోహితులు ప్రాతఃకాలంనుంచి పంచసూక్తములతో అభిషేక కార్యక్రమాలు, పుష్పార్చన, కుంకుమార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. భక్తులు చిన్నారులకు పురోహితులచే అక్షరాభ్యాసాలు చేయించుకున్నారు. అదేవిధంగా సంగమేశ్వరంలోని ఉమామహేశ్వరాలయంలో లలితాదేవి అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులచే విశేష పూజలందుకున్నారు.

జూపాడుబంగ్లా: దేవీనవరాత్రుల్లో భాగంగా మండలంలోని తాటిపాడు శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సరస్వతీ అమ్మవారు చంద్రఘంటరూపంలో, సుంకులమ్మ ఆలయంలో అన్నపూర్ణమాతగా భక్తులకు దర్శనమిచ్చారు.

నందికొట్కూరు: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భక్తులందరికీ శ్రీ భవానిదేవి అలంకారంలో మంగళవారం అమ్మవారు దర్శనమిచ్చారు. పాములపాడు మండల కేంద్రంలో శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు.

పగిడ్యాల: శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజైన మంగళవారం పాత ముచ్చుమర్రిలోని లలితా సంగమేశ్వర దేవాలయంలోని అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

ఘనంగా జ్యోతుల మహోత్సవం



ఆకాశంలోకి జ్యోతిని వదులుతున్న దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని చౌట్కూరు గ్రామంలో వెలసిన శ్రీ సుంకులాపరమేశ్వరీ దేవి జ్యోతుల మహోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా సాగాయి. వేడుకలకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తెలంగాణ బీజేపీ నాయకురాలు డీకే అరుణ అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజల అనంతరం శ్రీ కాశిరెడ్డి నాయన స్వామివార్ల జ్యోతిని వెలిగించి గగనతలంలోకి వదిలారు. జ్యోతి మహోత్సవ వేడుకలలో నందికోల సేవా, బిందె సేవా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ మదార్‌సాహెబ్, మల్లికార్జునప్ప, చంద్రశేఖరప్ప, కమతం వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పనులు కల్పించాలి



మాట్లాడుతున్న పీడీ రామచంద్రారెడ్డి

మహానంది: గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం బండిఆత్మకూరు మండలం పార్నపల్లె, సంతజూటూరు, పెద్దదేవలాపురం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్, ఉపసర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, ఏపీఓ వసుధారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నూతన భవనాల ప్రారంభోత్సవం

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పాటు నూతన భవనాలు ప్రారంభోత్సవం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు.ఆయన మాట్లాడుతూ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రానున్నారని, నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను ప్రారంభించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.